క్లుప్తంగా

నేడు బీపీ మండల్ జయంతి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో బీసీ సెల్, మహాత్మా జ్యోతిరావు పూలే సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 25న బీపీ మండల్ జయంతిని నిర్వహించనున్నట్లు సెంటర్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

కేయూ క్యాంపస్: విద్యార్థులు విద్యతోపాటు వృత్తి నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి సూచించారు. కేంద్ర ప్రభుత్వ వృత్తి నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ సఫల్ స్కీంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని కళాశాలలో శనివారం నిర్వహించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ రెహమాన్, రిసోర్స్ పర్సన్లు పూర్ణ శశికాంత్, డాక్టర్ ఎల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమకొండ పీఎస్ తనిఖీ

వరంగల్ క్రైం: వార్షిక తనిఖీల్లో భాగంగా హనుమకొండ పోలీస్ స్టేషన్‌ను సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా శనివారం సందర్శించి తనిఖీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలతో పాటు స్టేషన్‌లో నమోదైన కేసులు, వాటి రికార్డులను పరిశీలించారు. ముఖ్యమైన కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సతీష్, సబ్ ఇన్‌స్పెక్టర్లు అశోక్, సతీష్, పరశురాములు, సిబ్బంది పాల్గొన్నారు.

డీపీఆర్‌ఓపై చర్య తీసుకోవాలి

వరంగల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అందరు చూస్తుండగా పరుష పదజాలంతో ఓ మహిళ అధికారిని బూతులు తిట్టిన డీపీఆర్‌ఓ అయాబ్‌అలీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేయాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం, అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్ సత్యశారదకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఆగస్టు 15న జరిగిన వేడుకల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ సందేశ ప్రతుల విషయంలో చేయని తప్పుకు ఏపీఆర్‌ఓ ప్రేమలతను అయాబ్‌అలీ దూషించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘాల నాయకులు తరాల సందీప్, అశోక్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రాజేందర్, కుమారస్వామి, రమేష్, వెంకట్, విక్రమ్ పాల్గొన్నారు.

దాశరథి జయంతి వేడుకలు

హసన్‌పర్తి: సాయుధ పోరాట యోధుడు, సాహితీవేత్త దాశరథి రంగాచార్యుల జయంతి వేడుకలను ఒకటో డివిజన్ ముచ్చర్లలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానికులు వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేష్, రమేష్, శ్రవణ్, కుమార్‌రెడ్డి, సతీష్, విజయ్‌పాల్, దయాకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'సాదా బైనామా' గడువు పొడిగించాలి

వరంగల్: ప్రస్తుత అమలు ఉన్న ధరణిలో ఉన్న లోపాలను సవరించడంతో పాటు గ్రామాల్లోని భూమి మొత్తాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేయాలని, సాదా బైనామా గడువు పొడిగించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ కోరారు. ఈమేరకు కలెక్టర్ సత్యశారదను శనివారం కలిసి ఆర్‌ఓఆర్ నూతన చట్టంపై పలు సూచనలు చేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యలపై రైతులకు సలహాలు, సూచనలు చేసేందుకు విద్యాధికారులను ఆయా గ్రామాలకు చెందిన వారిని అధికారులుగా నియమించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీల రిజర్వేన్లను శాస్త్రీయంగా వర్గీకరించాలి

హన్మకొండ: ఎస్సీ, ఎస్టీలపై నేటికీ కొనసాగుతున్న అంటరానితనం, కులవివక్ష, అణచివేత, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధిపై అధ్యయనానికి జాతీయ స్థాయి కమిషన్ వేసి ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను శాస్త్రీయంగా వర్గీకరించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ కోరారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, వివక్షకు గురై రిజర్వేషన్ ఫలాలు అందక సంచార జీవితం గడుపుతున్న ఎస్సీ, ఎస్టీ కులాలకు వర్గీకరణలో మొదటి ప్రాధాన్యత కల్పించాలని ఆయన ఒక ప్రకటనలో సూచించారు.

మహిళా సాధికారతకు నైపుణ్య శిక్షణ దోహదం

న్యూశాయంపేట: మహిళా సాధికారత సాధించడానికి అతివలకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ ఎంతో దోహదపడుతుందని ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ అన్నారు. మండిబజార్‌లోని డాక్టర్ పెర్లీ ఫౌండేషన్ రిసోర్స్ సెంటర్ ప్రారంభోత్సవం, టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. బ్యూటీషియన్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. జన్ను క్రాంతి, మండిబజార్ మర్చంట్ అసోసియేషన్ అడ్వైజర్ ఇస్మాయిల్, ప్రవీణ్, ప్రభు సుధీర్, శ్రీకాంత్, అజయ్, క్రాంతి, వాణి, సమరిన్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమి ముందస్తు వేడుకలు

నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ముందస్తుగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. ఉట్టికొట్టి సందడి చేశారు. - సాక్షి నెట్‌వర్క్


మడికొండలోని ప్రభుత్వ పాఠశాలలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు


హనుమకొండ సుబేదారి ప్రభుత్వ హైస్కూల్‌లో ఉట్టి కొడుతున్న విద్యార్థులు


కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్‌లో వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు


వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతంలోని ఏకశిల డిజీ స్కూల్‌లో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో..


నయీంనగర్: ఏకశిల హైస్కూల్‌లో..


హనుమకొండ రాంనగర్‌లోని షైన్ స్కూల్‌లో..


హసన్‌పర్తి: సెయింట్ మేరీస్ పాఠశాలలో..

సంస్కృతం ఉచ్ఛరణతో మేధాశక్తి మెరుగు

హన్మకొండ అర్బన్: బీజాక్షరాలతో కూడిన సంస్కృత భాష ఉచ్ఛరించడం, రాయడం ద్వారా మానసికంగా మేధాశక్తి మెరుగవుతుందని సంస్కృత లెక్చరర్ శ్రీవిద్య అన్నారు. విశ్వ సంస్కృత భాషా దినోత్సవం సందర్భంగా నగరంలోని వడ్డేపల్లి పింగిళి మహిళా జూనియర్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీవిద్య మాట్లాడుతూ సంస్కృతం అంటే కేవలం భాష మాత్రమే కాదని, ఆయుర్వేద, సామాన్య, నీతి శాస్త్రాలతో పాటు తదితర శాస్త్రాలకు మూలాలైన గ్రంథాలు సంస్కృత భాషలోనే మొట్టమొదటగా లభించినట్లు ఆధారాలు ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు సంస్కృత భాషా ప్రాధాన్యతను వివరిస్తూ చేసిన ఆట, పాటలు, ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు కవిత, కళాశాల లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.


సంస్కృత దినోత్సవంలో లెక్చరర్లు, విద్యార్థినులు

శ్రీకృష్ణతత్వాన్ని తెలియజేయడానికే వేడుకలు



హన్మకొండ కల్చరల్: శ్రీకృష్ణ తత్వాన్ని, భక్తి మార్గాన్ని యాదవ కుల బంధువులలో పెంపొందించడానికి శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నామని యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్, కుడా మాజీచైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. హనుమకొండలోని వేద బంక్వెట్ హాల్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గొల్ల – కురుమ సంస్కృతిక వేడుకల్లో భాగంగా ఈ నెల 26న సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 12గంటల వరకు హనుమకొండ హంటర్‌రోడ్‌లోని డి– కన్వెన్షన్ హాల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం


మాట్లాడుతున్న కార్పొరేటర్ నరేంద్రకుమార్

కాశిబుగ్గ: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ అన్నారు. సీనియర్ సిటిజన్ అసోసియేషన్ వరంగల్ ఆధ్వర్యంలో వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధనాస్పత్రి సహకారంతో కాశిబుగ్గ కేవీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. వైద్యులు హరికిషన్, వసంత, శ్వేత, జ్యోతి, కమలకుమారి, సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, సదానందం, గోవర్ధన్, నరసింహ, రాజేంద్రప్రసాద్, రాజమౌళి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లం కీర్తి, సౌఖ్యకు ప్రశంసలు

హన్మకొండ కల్చరల్: నగరానికి చెందిన భరత నాట్యం కళాకారిణి మల్లం కీర్తి, డ్రాయింగ్ కళాకారిణి సౌఖ్యను పలువురు ప్రశంసించారు. స్వర్ మహతి కళాపరిషత్ ఆధ్వర్యంలో సృజనోత్సవంలో భాగంగా హైదరాబాద్‌లో రవీంద్రభారతిలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో భరతనాట్యం విభాగంలో కీర్తి రెండవ స్థానంలో నిలవగా, డ్రాయింగ్ విభాగంలో సౌఖ్యకు ప్రెసిడెంట్ అవార్డు లభించింది. ఆగస్టు 15న జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ నుంచి బాలరత్న అవార్డును మల్లం కీర్తి అందుకున్నారు.

నేరాలను అరికట్టేందుకే కార్డన్ సెర్చ్

ఖిలా వరంగల్: సమస్యాత్మక ప్రాంతాల్లో నేరాలను అరికట్టేందుకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా తెలిపారు. శివనగర్‌లోని ఏసిరెడ్డినగర్‌లో వరంగల్ పోలీసులు శనివారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటా నిర్వహించిన తనిఖీల్లో రూ.32 వేలు విలువైన గుట్కాలు, మద్యం, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 24 బైక్‌లు సీజ్ చేశారు. అద్దెకుంటున్న వ్యక్తులు, అనుమానితులను విచారించి వదిలేశారు. ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా మాట్లాడుతూ.. మద్యం, గంజాయి మత్తులో రహదారులపై తిష్టవేసి బెదిరింపుల పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, అపరిచిత వ్యక్తులు వస్తే వెంటనే డయల్ 100 చేయాలని సూచించారు. ఈ కార్డన్ సెర్చ్‌లో ఏసీపీ నందిరాంనాయక్, ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, గోపీ, మల్లయ్య, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, తదితరులు పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం, గుట్కాలు

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రహసిత్

విద్యారణ్యపురి: పరీక్షల సమయంలో విద్యార్థులు మానసికంగా ఎలాంటి ఒత్తిడికి గురికావొద్దని, మానసిక ప్రశాంతతను పెంపొందించుకోవాలని జిల్లా మానసిక ఆరోగ్య అధికారి ప్రహసిత్ సూచించారు. హనుమకొండలోని ప్రభుత్వ వృత్తివిద్యా కళాశాలలో జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రధాన వక్తగా మాట్లాడారు. ఆందోళనలు, నిరాశ, ఆత్మహత్యల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో డీఐఈఓ గోపాల్, ప్రిన్సిపాల్ శ్రీధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సవ్వాసి శ్రీనివాస్, స్టూడెంట్ కౌన్సిలర్లు రాజేంద్రప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మడికొండ పాఠశాలకు టీవీ బహూకరణ

మడికొండ: కాజీపేట మండలం మడికొండ మండల ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ క్లాస్‌ల నిర్వహణకు పూర్వ విద్యార్థి మధుసూదన్‌రెడ్డి రూ.50 వేల విలువగల టీవీని అందజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం మల్లారెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో నివాసముంటున్న మధుసూదన్ రెడ్డి తన బంధువులైన రఘువీరా రెడ్డి, 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి ద్వారా పాఠశాలకు టీవీని శనివారం బహూకరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాధికారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు డిజిటల్ క్లాస్‌లను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం మల్లారెడ్డి మాట్లాడుతూ పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలకు దాతలు చేయూనందించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోమల్‌రెడ్డి, రాజేశ్వరి, అరుణ, రమేష్‌బాబు, హైమావతి, కమల, సరిత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మడ్డి అరుణ పాల్గొన్నారు.


టీవీని అందజేస్తున్న మధుసూదన్ రెడ్డి బంధువులు

సౌండ్ బాక్స్‌ల అందజేత

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 20వ డివిజన్ కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గుడిబడి)కు 2009 –2010వ పదవ తరగతి పూర్వ విద్యార్థులు సౌండ్ బాక్స్‌లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం కుమారస్వామి, ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తుమ్మ రాజేష్, గణి పాక భాను, పల్లకొండ వినోద్, ముప్పిడి ప్రశాంతి, తొటం చాణక్య, గౌస్‌పాషా పాల్గొన్నారు.


బాక్స్‌లతో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

అభివృద్ధి పనుల్లో జాప్యం చేయొద్దు

హన్మకొండ చౌరస్తా: నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతలో రాజీపడకుండా, జాప్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశించారు. హనుమకొండ 5వ డివిజన్‌లోని కొత్తూరు జెండాలో రూ.40లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, సైడ్ డ్రెయినేజీ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం స్థానిక పోచమ్మ దేవాలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో 5వ డివిజన్ కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్, నాయకులు నాయిని లక్ష్మారెడ్డి, ప్రవంతి, సంపత్, సతీష్, శ్రవణ్, సురేష్, వేణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

చట్టాలపై విద్యార్థులకు అవగాహన


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు, మహిళలు

నయీంనగర్: హనుమకొండ పెట్రోల్ పంప్ గర్ల్స్ హైస్కూల్‌లో విద్యార్థులకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సఖి వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సఖి సెంటర్ కేస్ వర్కర్లు వినీల, హరిత మాట్లాడుతూ చిన్న పిల్లల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం ప్రివెన్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అసాల్ట్ యాక్ట్ తీసుకువచ్చిందని వివరించారు. మహిళల రక్షణ కోసం గృహహింస చట్టం ఉందని తెలిపారు. భార్యాభర్తలను కౌన్సెలింగ్ ద్వారా ఒకటిగా కలపడం, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, అకారణంగా గర్భ విచ్ఛిత్తి, ఇతర వేధింపులు, మానసికంగా కృంగిపోయే మహిళలు, బాలికల రక్షణ కోసం సఖి సెంటర్ కృషి చేస్తోందని తెలిపారు. ఉచిత కౌన్సెలింగ్ సహాయం, న్యాయ, పోలీస్, వైద్య సహాయం, తాత్కాలిక వసతి సఖి కేంద్రం అందిస్తున్నట్లు తెలిపారు. బాధితులు 181, 0870 2452112 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు

మడికొండ: మడికొండ గ్రామంలో శనివారం పెద్దమ్మతల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మతల్లికి ఉదయం చీరలు, పసుపు, కుంకుమతో మొక్కులు చెల్లించి, సాయంత్రం డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపు నిర్వహించి బోనాలు సమర్పించారు. ఆదివారం పెద్దమ్మతల్లికి మేకపోతులను బలివ్వనున్నట్లు కుల పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దువ్వ నవీన్, గౌరవ అధ్యక్షుడు దువ్వ కొమురయ్య, నర్ర దుర్గయ్య, దువ్వ కట్టయ్య, శ్రీకాంత్, నర్ర కొంరయ్య, నర్ర అయిలయ్య, కుక్కల దేవరాజ్, కుక్కల శ్రీకాంత్, దువ్వ విజయ్, కులసంఘం పెద్దలు గుర్రం అమర్‌నాథ్, కుక్కల సమ్మయ్య, నాయకులు అల్లం శ్రీనివాస్, కుందురు రాజేష్‌రెడ్డి, మునిగాల కరుణాకర్, శ్రీకాంత్, వినోద్, అనిల్, భిక్షపతి, అర్చకులు శ్రీనివాస్, మంత్రవాది వెంకటప్రసాద్ పాల్గొన్నారు.


బోనాలతో బయల్దేరిన మహిళలు, భక్తులు

అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు


కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

ఖిలా వరంగల్: అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లను అందజేస్తామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. ఈమేరకు వరంగల్ దూపకుంట రోడ్డులోని నిర్మిస్తున్న డబుల్‌బెడ్రూం ఇళ్లను కాంట్రాక్టర్లు, అధికారులు, స్థానిక కార్పొరేటర్లు బైరబోయిన ఉమ, వేల్పుగొండ సువర్ణతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ఇళ్లను త్వరగా పూర్తిచేసి అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పించాలని కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులకు సూచించారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా డ్రా తీసి పేదలకు అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పోశాల పద్మ, పుర్కాన్, బాబు, గుండు చందన, కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజు, బైరబోయిన దామోదర్, బోగి సురేష్, పూర్ణచందర్, కేడల పద్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

హసన్‌పర్తి: విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు సూచించారు. ఎస్‌వీఎస్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు శనివారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

ఖిలా వరంగల్: తూర్పుకోట హనుమాన్ సెంటర్‌లో శరత్ మ్యాక్సి విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి హనుమకొండ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యఅతిథిగా మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య హాజరై స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ, మార్కెట్ మాజీ డైరెక్టర్ సంగరబోయిన చందర్‌తో కలిసి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ముద్దసాని మల్లిక, సంజీవరావు, ధర్మరాజు, కేశవరాజు, రాంబాబు, విష్ణు, శ్రీనివాస్, రాజమల్లు, శ్రీను, రాజు, రాజేష్, మధు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా కార్యవర్గం

కాశిబుగ్గ: కాశిబుగ్గలో బీజేపీ ఎస్సీ జిల్లా మోర్చా కమిటీని శనివారం ప్రకటించారు. ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా నలింగటి నరసింగం, పోలెపాక జనార్దన్, వీరస్వామి, దామెర సదానందం, మైదం వీరస్వామి, చింతల నవీన్, తుల అనూష, జన్ను రవి, ప్రధాన కార్యదర్శులుగా మాదాసు రాజు, ఉసిల్ల దయాకర్, తనుగుళ్ల అంబేద్కర్, ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీగా నమిండ్ల కన్నయ్య, కార్యదర్శులుగా సారం రాజు, సిలువేరు భాస్కర్, మంతెన అనిత, కంజెర్ల విజయ్, ఇనుమగంటి రాజశేఖర్, సింగారపు నీలాకర్, మరుముల్ల ప్రవీణ్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా మేకల రాజు, సిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మైదం సుదర్శన్, స్పోక్ పర్సన్‌గా గొర్రె కోటిని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పోలెపాక మార్టిన్ లూథర్ ప్రకటించారు.

ఆధునిక ప్రమాణాలతో ఫెర్టిలిటీ సేవలు

హన్మకొండ చౌరస్తా: ఆధునిక ప్రమాణాలతో సంతాన సాఫల్య వైద్య సేవలు అందిస్తున్నట్లు ఫెర్టి9 ఫెర్టిలిటీ సెంటర్ హనుమకొండ బ్రాంచ్ చీఫ్ డాక్టర్ అనూషరెడ్డి తెలిపారు. హనుమకొండ కుడా రోడ్డులోని ఫెర్టి9 సెంటర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమయంలో ఆమె మాట్లాడారు. దేశవ్యాప్తంగా 13 బ్రాంచీలు ఏర్పాటు చేసి పిల్లలు లేని తల్లిదండ్రులకు నమ్మకమైన వైద్య సేవలను అందిస్తున్నట్లు వివరించారు.

కారు – బైక్ ఢీ.. కానిస్టేబుల్‌కు గాయాలు

మామునూరు: బైక్‌ను కారు ఢీకొట్టడంతో టీఎస్ఎస్పీ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలైన సంఘటన మామునూరు టీఎస్ఎస్పీ బెటాలియన్ పెట్రోల్‌బంక్ సమీపంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. వరంగల్‌కు చెందిన బి.సతీష్ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రోజు వారిగానే విధులు ముగించుకుని బైక్‌పై శనివారం ఉదయం ఇంటికి బయలుదేరారు. ఈక్రమంలో రంగశాయిపేట ప్రాంతానికి చెందిన తోట సతీష్ కారును వేగంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న బైక్‌ను వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై బెటాలియన్ పెట్రోల్ బంక్ వద్ద బలంగా ఢీకొట్టాడు. దాంతో హెడ్ కానిస్టేబుల్ తల, పాదానికి తీవ్ర గాయాలయ్యాయి. దాంతో అధికారులు హుటాహుటిన ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ధర్మపురి రామారావు బీజేపీ కార్యకర్త కాదు

వరంగల్: నగరంలోని 14వ డివిజన్‌కు చెందిన ధర్మపురి రామారావు బీజేపీ క్రియాశీల కార్యకర్త కాదని, ఆయన ఆన్‌లైన్‌లో సభ్యత్వం తీసుకున్నాడని 21వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కోమాకుల నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ బహుజన సంఘం, కుల సిద్ధాంతం పేరుతో సుందరయ్యనగర్, ఏనుమాముల కార్యకర్తలతో కలిసి తిరిగేవాడని, కార్యకర్తల మధ్యతో చిచ్చు పెట్టే మనస్తత్వం గల వ్యక్తి కావడంతో గతంలోనే 14వ డివిజన్ నుంచి అతడిని బహిష్కరించినట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్ ఏకశిలనగర్‌కు చెందిన శేర్ల కుమారస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు బోరిగం నాగరాజు శనివారం పరామర్శించి ఆర్థిక సాయంతోపాటు బియ్యం అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు రాధారపు మహేష్, ప్రధాన కార్యదర్శి మద్దూర్ శివ, రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఖిలా వరంగల్: వరంగల్ 17వ డివిజన్ స్తంభంపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు హెండిగె శంకర్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో కార్పొరేటర్ గద్దె బాబు, బెంబిరి బాబురావు, రామారావు, గోపాల్‌రావు, శంకర్‌రావు తదితరులు ఉన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

హన్మకొండ: కాజీపేటలోని ఆరుట్ల రాంచంద్రారెడ్డి (ఏఆర్‌ఆర్) కాలనీ వాసుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కాలనీవాసులు కోరారు. ఈమేరకు హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు శనివారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మునిగాల భిక్షపతి, జిల్లా సమితి సభ్యురాలు రాసమల్ల దీన పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుకు చొరవ చూపండి

విద్యారణ్యపురి: సీపీఎస్ రద్దుచేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) బాధ్యులు కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సదయ్య, హనుమకొండ, వరంగల్ జిల్లాల బాధ్యులు రవి, రాంబాబు, నాగరాజు, తిరుపతి, విద్యాసాగర్, మహేందర్, గంగాధర్ తిలక్, కనకయ్య, రవీందర్‌రెడ్డి, బాబు పాల్గొన్నారు.

ఆ నాయకులపై చర్యలు తీసుకోవాలి

కాశిబుగ్గ: ఎల్బీఆర్‌నగర్ గుడిసెవాసుల విద్యుత్ మీటర్ల విషయంలో తప్పుడు ఆరోపణలు చేయిస్తున్న నాయకులపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. ఈమేరకు మాజీ ఎమ్మెల్సీ కొండా మరళీధర్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఓ సిటీలోని తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో కొండా మురళిని కాలనీవాసులు కలిసి విన్నవించారు.

పూర్వ విద్యార్థుల చేయూత

హసన్‌పర్తి: నగరంలోని కిట్స్ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేయూతనందించారు. కళాశాల పూర్వ విద్యార్థి, వసంత టూల్స్ అండ్ క్రాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ దయానంద్ రెడ్డి దంపతులు రూ.2కోట్లు విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. అలాగే, అమృత టూల్స్ అండ్ క్రాఫ్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్‌రెడ్డి రూ.25 లక్షలు, ఇంజనీర్ భీమ్‌రావ్ రూ.2లక్షలు అందజేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ మార్కజీ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనకు వెళ్లారు. వృత్తివిద్య కోర్సు శిక్షకురాలు శిరీష ఆధ్వర్యంలో కొత్తవాడలోని చేనేత వస్త్ర పరిశ్రమ, శతరంజీల ఉత్పత్తులను శనివారం పరిశీలించారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

వరంగల్: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కఠిన చట్టాలను అమలులోకి తీసుకురావాలని, వారికి రక్షణ కల్పించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి కోరారు. ఈమేరకు వరంగల్ ఏనుమాముల మార్కెట్ నుంచి బాలాజీనగర్ జంక్షన్ వరకు శనివారం ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు.